Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 334 | హైదరాబాద్ | గురువారం 22 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



డ్రగ్స్ రహిత భారత్

- మాదకద్రవ్యాలు భవిష్యత్ తరాలకు ముప్పు
- దేశ వ్యతిరేక సంస్థలకు డ్రగ్స్ ముఠాల ఆర్థిక సహాయం
- పోలీసు బలగాలు, ఏజెన్సీలన్నీ ఐక్యపోరాటం చేయాలి
- పోలీసుల సంస్మరణ దినంలో కేంద్రం హోమంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

భారత్‌ను 2029 డిసెంబర్ చివరి నాటికి డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలు భవిష్యత్ తరాలకు ముప్పుగా పరిణమించాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు ముఠాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలి పారు. రానున్న మూడేళ్ల పాటు డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాలను నిర్మూలించాలని, ఇందుకు దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు బలగాలు, ఏజెన్సీలు అంకిత భావంతో, సమన్వయంతో కలిసి

-2వ పేజీలో



7 రోజుల తరువాత సీజేపీ నాయకులకు భారీ ఊరట

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు సౌరవ్ దాస్ , అశుతోష్ రాంకా కు భారీ ఊరట లభించింది. ఏడు రోజుల పాటు జైల్లో గడిపిన ఇరువురికీ జ్యుడిషియల్ రిమాండ్‌పై ఒక ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ విడుదల చేయాలని బుధవారం ఆదేశించారు. జంతర్ మంతర్‌లోకి ప్రవేశించి, జాతీయ జెండాలను ఎగురవేశారన్న ఆరోపణలతో సౌరవ్ దాస్, అశు తోష్ రాంకా అక్టోబర్ 14 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. శాంతి ఒప్పందాలను ఉల్లంఘించి, తాళం వేసిన గేటును దాటి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారనే ఆరోపణలపై అక్టోబర్ 13న దాస్, రాంకాలను అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు ఈ ప్రదేశాన్ని నియమిత నిరసన ప్రదేశంగా ప్రకటించారు.వారిద్దరినీ తొలుత అక్టోబర్ 14న ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి రిమాండ్ చేశారు. అక్టోబర్ 19న వారి కస్టడీని మరో రెండు రోజులు పొడిగించగా, అది బుధవారంతో ముగియాల్సి

-2వ పేజీలో

కాంగ్రెస్‌లో తేలని నామినేటెడ్ లొల్లి

తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల పంచాయితీలు తేలడం లేదు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా.. ఇంకా నియామకాలు చేపట్టక పోవడంతో కేడర్ లో నిరాశ నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తాజా రాజకీయ పరిణామాలపై నిర్వహించిన భేటీలో ఎప్పటిలాగే భారీ ఎజెండా తెరపైకి వచ్చింది.



- ఇంకా భర్తీ కానీ పోస్టులు
- మూడేళ్లు అవుతున్నా మీనామేషాలు
- జాబితా రెడీ అంటూనే వెన్నకి
- కేడర్ లో ఆగ్రహం..

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

పార్టీ కమిటీల నియామకాలు పూర్తి చేయడం, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను కొలిక్కి తేవడం, గడువు ముగిసిన కార్పొరేషన్ చైర్మన్ల పదవుల రెన్యూవల్, త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలనూ గెలవాలన్న సీఎం ఆదేశాల వరకు అన్నీ చర్చలకే పరిమితవ ుయ్యాయి. అయితే సమావేశాలు ముగిసిన ప్రతిసారీ త్వరలోనే నిర్ణయం అనే ప్రకటన తప్ప క్షేత్రస్థాయిలో అడుగు ముందుకు పడటం లేదు.

భర్తీ చేస్తారా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా.. పదవుల భర్తీ వ్యవహారం ఎప్పటికీ పరిష్కారం కాని ఒక శాశ్వత సమస్యలా మారిపోయింది. నామి నేటెడ్ పోస్టుల భర్తీపై ఇప్పటికే పదుల సం ఖ్యలో కమిటీలు, వందల గంటల అంతర్గత చర్చలు జరిగాయి; అధిష్ఠానం వద్దకు జాబితాలు వెళ్లడం, మళ్లీ వెనక్కి రావడం కామన్‌గా మారిపోయింది. పార్టీ కష్టకాలంలో జెండాలు మోసి, లాఠీ దెబ్బలు తిన్న ద్వితీయ శ్రేణి కార్యకర్తలు, ఆశావహులు తమకు ఎప్పుడు న్యాయం జరుగుతుందా అని కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కానీ, ఒకరి వర్గానికి పదవి ఇస్తే మరొకరు అలిగి తిరుగుబాటు చేస్తారన్న అంతర్గత భయాలు, లాబీయింగ్‌ల నడుమ ఒక్క నిర్ణ యం తీసుకోవడానికి కూడా అగ్రనాయ కత్వం నెలల తరబడి తటపటాయిస్తూ కాల యాపన చేస్తోంది. ఈ క్రమంలో అసలు పోస్ట్ లు భర్తీ చేస్తారా? ఇలాగే కాలం గడుపు తారా అన్న

-2వ పేజీలో



ప్రజలకు మీరు.. మీకు మేము

- అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- 2028 నాటికి పోలీస్ విభాగంలో ఖాళీలన్నీ భర్తీ చేస్తాం
- హోంగార్డుల కుటుంబాలకుఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు
- డీజీపీ సీవీ ఆనంద్‌కు సీఎం ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

రాష్ట్ర పోలీస్ విభాగంలో ఉన్న అన్ని ఖాళీలను 2028 నాటికి భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 'పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి, ప్రతి సిబ్బందికి క్రమశిక్షణే బలం. మీ నిజాయి తీయే మీ గౌరవం. పోలీస్ విభాగంలో సాంకే తికత ఎంత పెరిగినా

-2వ పేజీలో

1 నుంది కొత్త కాలింగ్ విధానం..

- ఫోన్‌లో నంబర్‌తో పాటు పేరు కూడా!
- సైబర్ మోసాలకు చెక్ 4జీ, 5జీ వినియోగదారులకు కొత్త సేవ

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. నవంబర్ 1, 2026 నుంచి దేశవ్యాప్తంగా కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ (CNAP) విధానాన్ని అమలు చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ విధానం అందుబాటులోకి వస్తే ఫోన్‌కు వచ్చే కాల్‌లో నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను

-2వ పేజీలో



దసరా మద్యం ధమాకా!

- ఈ నెల 19 రోజుల్లోనే రూ.2,054 కోట్ల అమ్మకాలు
- 19న ఒక్కరోజే రూ.300 కోట్ల విలువైన మద్యం విక్రయాలు
- సీజన్‌లో కొత్త రికార్డు



హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

తెలంగాణలో దసరా పండుగ ఎక్సైజ్ శాఖకు ధమాకానిచ్చింది. అక్టోబర్ నెలలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లో రాష్ట్రంలో ఊహించని విధంగా మద్యం విక్రయాలు భారీగా

-2వ పేజీలో



ఒకటి ఓసీ.. మరోటి బీసీ

- పట్టభద్రుల పోరులో బీఆర్ఎస్ సామాజిక సమీకరణాల లెక్కలు
- 'హైదరాబాద్'కు బీసీ అభ్యర్థి వైపు కేసీఆర్, కేటీఆర్ మొగ్గు?
- వరంగల్ బరిలో రాకేశ్‌రెడ్డికి మరోసారి అవకాశం దక్కినట్టే !
- నేడో రేపో పార్టీ అభ్యర్థుల పేర్లపై బీఆర్ఎస్ అధికారిక ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీఆర్ఎస్ సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకోనుంది. వచ్చే ఏడాది మార్చిలో 'హైదురాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, 'వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల పదవీకాలం ముగియుయునుంది. ఈ రెండు స్థానాల్లో ఒకటి ఓసీ, మరొకటి బీసీ సామాజి కవర్గానికి కేటాయించాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ ఇప్పటికే రెండు స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించడంతో బీఆర్ఎస్ కూడా

-2వ పేజీలో

తిప్పికొడతాం

- ఇండీ కూటమి ప్రచారంపై రేపటి నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ కార్యక్రమాలు
- బీజేపీ నేత, ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్



హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

ఇండీ కూటమి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతామని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత డాక్టర్ కే లక్ష్మణ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేతృత్వంలో జరుగుతున్న నిరసనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని విమర్శిం చారు .మ్యాప్‌లు చూడండిన్యాయస్థానాలు, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా తప్పు డు ప్రచారం చేస్తూ, దేశంలో అరాచకత్వానికి తెరలేపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీపై మండిపడ్డారు. బుధవారం మీడియాతో లక్ష్మణ్ మాట్లాడుతూ.. అధికారం

-2వ పేజీలో

ప్రజలకు మీరు.. మీకు మేము



(మొదటి పేజీ తరువాయి)

మీలోని మానవతా దృక్పథం పోకూడదు. ప్రజల భద్రత విషయంలో మీరు అందించే భరోసాయే మీకు లభించే గొప్ప గుర్తింపు. ప్రజలకు మీరు అండగా నిలవండి. మీ సంక్షేమానికి, మీ కుటుంబాల భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది..' అని హామీ ఇచ్చారు.

అమరులైన హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం రూ. 5 లక్షల పరిహారం అందిస్తుండగా దాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో బుధవారం జరిగిన అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అమరుల కుటుంబీకులను సన్మానించి, పరిహారం చెక్కులుఅందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

'పోలీసు అమరవీరుల్ని స్మరించుకునే రోజు ఎంతో భావోద్వేగమైనది. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరులకు నివాళులు. దేశవ్యాప్తంగా గడిచిన ఏడాది కాలంలో 154 మంది అమరులు కాగా.. రాష్ట్రంలో ఏఎస్సై దేవి సింగ్, కానిస్టేబుళ్లు ఎంపల్లి ప్రమోద్ కుమార్, శీలం కమలాకర్‌తో పాటు ఎక్సైజ్ విభాగంలో పని చేసిన గాజుల సౌమ్య విధి నిర్వహణలో అశువులు బాశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలను మరువలేం. ఆ అమరుల కుటుంబం ఒంటరిది కాదు.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ పూర్తిగా భర్తీ చేయలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు..ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయి. తెలంగాణ సమాజం అండగా ఉంటుంది.

పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యం..

రాష్ట్ర అభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో కీలకం. అందుకే పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించాం. సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే ట్రాన్స్‌జెండర్లను పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంచాం. విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా గణనీయంగా పెంచాం. ఇది కేవలం ఆర్థిక సహాయం కాదు.. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం. యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌లో డీజీపీ నుంచి హోంగార్డు వరకు అన్ని స్థాయిల పిల్లలకు అవకాశం ఇచ్చాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

మహిళలు, చిన్నారుల కేసుల్లో జాగ్రత్తగా ఉండాలి..

'కాలంతో పాటు నేర స్వభావం మారుతోంది. దీంతో కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు శాఖను ఆధునీకరించాలని నిర్ణయించాం. పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయం తీసుకున్నాం. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి అత్యంత ప్రమాదకరం. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందిస్తున్నా. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలి..'అని సీఎం సూచించారు.

పోలీసులు నైపుణ్యం పెంచుకోవాలి: డీజీపీ సీవీ ఆనంద్

'తెలంగాణ ఉద్యమాల గడ్డ...నక్సలైట్ల హింసను ఎదుర్కొనే క్రమంలో వందలాది మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారు. కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురవేయడం పోలీసుల పట్టుదలకు నిదర్శనం. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు, వ్యవస్థీకృత నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు సిబ్బంది నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకుని, ఇన్ సర్వీస్ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలి..'అని డీజీపీ సీవీ ఆనంద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, పోలీస్ విభాగానికి సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో తేలని నామినేటెడ్ లొల్లి

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంస్థాగత నియామకాలతో పాటు రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తప్పక గెలవాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టిగానే నిర్దేశిస్తున్న ప్పటికీ.. పార్టీ మెషినరీలో ఆ స్థాయి కదలిక కనిపిం చడం లేదు. నిరుద్యోగ పట్టభద్రుల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి, ప్రత్యర్థుల వ్యూహాలను దీటుగా ఎదుర్కొనే ప్రణాళికలు క్షేత్రస్థాయిలో లేవన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఖాళీ కాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్ల కోసం ఇప్పటినుంచే డజన్ల కొద్దీ సీనియర్లు ఢిల్లీ నుంచి గల్లీ దాకా పైరవీలు మొదలుపెట్టారు. అటు ఆశావహుల ఒత్తిడి, ఇటు సమీకరణాల చిక్కుముడులతో డెడ్‌లైన్లు మీద పడుతున్నా ఏ ఒక్క స్థానాన్ని ఏకాబి, ప్రాయంతో తేల్చలేని నంక్షోభం స్పష్టంగా కనిపిస్తోంది.ఒక నిర్ణయం తీసుకోవాలంటే వర్కింగ్ ప్రెసిడెంట్లు, మంత్రులు, పీసీసీ చీఫ్, సీఎం.. వీరి ఆమోదం తర్వాత మళ్లీ ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ, హైకమాండ్ అనుమతులు కావాలనే సుదీర్ఘ ప్రక్రియే పార్టీని నిలువునా స్తంభింపజేస్తోంది. అధికారంలో ఉన్నప్పటికీ నిర్ణయాధికా రంలో దూకుడు ప్రదర్శిం చలేకపోవడం, ఒక చిన్న కార్పొరేషన్ పోస్టు నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం వరకు ప్రతి అంశాన్నీ అపరిష్కృ తంగా నాన్చడం కాంగ్రెస్ మార్క్ రాజకీయ జాడ్యంగా కొనసాగుతోంది. సీఎం-పీసీసీ చీఫ్ భేటీలు ఎన్ని జరిగినా, ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారుతుండటంతో.. చివరకు డెడ్‌లైన్లు పలకరిస్తున్నా నిర్ణయాలు తీసుకోలేకపోవడమే అనలైన కాంగ్రెస్ సంస్కృతి అని పార్టీ కేడరే నిట్టూరుస్తోంది.

1 నుంచి కొత్త కాలింగ్ విధానం..

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం.

నంబర్‌తో పాటు పేరు ఎలా కనిపిస్తుంది?

ప్రస్తుతం ఫోన్‌కు కాల్ వచ్చినప్పుడు సాధారణంగా కాలర్ నంబర్ మాత్రమే కనిపిస్తుంది. అయితే కొత్త జఓస్తూ విధానంలో ఫోన్‌లో సేవ్ చేయని నంబర్ నుంచి కాల్ వచ్చినప్పుడు, ఆ నంబర్‌కు సంబంధించి టెలికాం సంస్థల వద్ద నమోదైన చందాదారుడి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ ఆ నంబర్‌ను వినియోగదారుడు తన ఫోన్‌లో ఇప్పటికే సేవ్ చేసుకుని ఉంటే, కాంటాక్ట్‌లో ఉన్న పేరుకే ప్రాధాన్యం ఉంటుంది.

విధానం అమలులోకి వచ్చిన తర్వాత వినియోగదారులు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చినప్పుడు అది ఎవరి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు కొంతవరకు అవకాశం ఉంటుంది. అయితే సిమ్ కార్డు ఎవరి పేరు మీద నమోదై ఉందో ఆ పేరే కనిపించే అవకాశం ఉండటంతో, ఫోన్‌ను వాస్తవంగా ఉపయోగిస్తున్న వ్యక్తి పేరు తప్పనిసరిగా కనిపిస్తుందని భావించకూడదు.

4జీ, 5జీ నెట్‌వర్క్‌లకు తొలుత అమలు

కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ అక్టోబర్ 13న జారీ చేసిన ఆదేశాల ప్రకారం, నవంబర్ 1 నుంచి 4జీ, 5జీ వంటి ఆధునిక మొబైల్ నెట్‌వర్క్‌లలో ఈ సేవను ప్రవేశపెట్టనున్నారు. వినియోగదారులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోకుండానే ఈ సేవను అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం సంస్థలకు సూచించారు. అయితే 2జీ, 3జీ నెట్‌వర్క్‌లు, ల్యాండ్‌లైన్ ఫోన్లకు ఈ విధానాన్ని అమలు చేసే అంశాన్ని తరువాత పరిశీలించనున్నారు.

సైబర్ నేరాలకు ఎంతవరకు అడ్డుకట్ట?

బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సంస్థల ప్రతినిధులమని చెప్పుకుంటూ మోసగాళ్లు ప్రజలకు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు అడుగుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో కాలర్ పేరు కనిపించడం వల్ల అనుమానాస్పద కాల్స్‌ను గుర్తించేందుకు ప్రజలకు కొంత సహాయం లభించవచ్చు. స్పామ్ కాల్స్, నకిలీ గుర్తింపులతో చేసే మోసాలను తగ్గించడంలోనూ ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే పేరు కనిపించిందని మాత్రమే ఆ కాల్ నిజమైనదని నమ్మకూడదు. మోసగాళ్లు ఇతరుల పేర్లను ఉపయోగించవచ్చు. బ్యాంకు అధికారులు లేదా ప్రభుత్వ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసినా, ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదు. అనుమానం కలిగించే కాల్స్ వస్తే సంబంధిత సంస్థ అధికారిక నంబర్‌కు మీరే ఫోన్ చేసి వివరాలను నిర్ధారించుకోవాలి.

వ్యక్తిగత గోప్యతకు రక్షణ

కొత్త విధానంలో వినియోగదారుల వ్యక్తిగత వివరాల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. కాల్ సమయంలో పేరు ప్రదర్శించేందుకు అవసరమైన సమాచారాన్ని టెలికాం సంస్థలు తమ రికార్డుల ఆధారంగా అందిస్తాయి. కాల్ ముగిసిన తర్వాత ఆ వివరాలను అనవసరంగా నిల్వ చేయకుండా భద్రతా చర్యలు పాటించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అంతర్జాతీయ కాల్స్‌కు సాధారణంగా కాలర్ పేరుకు బదులుగా 'ఇంటర్నేషనల్ కాల్' అని కనిపించనుంది. అలాగే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కాలర్ గుర్తింపు ప్రదర్శనపై మినహాయింపులు వర్తించవచ్చు.

ప్రజలకు ఉపయోగపడనున్న కొత్త సేవ

మొత్తంగా జఓస్తూ విధానం అమలులోకి వస్తే తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం సులభమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క విధానంతోనే సైబర్ నేరాలు పూర్తిగా ఆగిపోతాయని చెప్పలేం. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకపోవడం, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకపోవడం కూడా అంతే ముఖ్యం. టెలికాం సంస్థలు ఈ సేవను ఎలా అమలు చేస్తాయన్న దానిపై కూడా దీని ప్రభావం ఆధారపడి ఉంటుంది.

ఒకటి ఓసీ.. మరోటి బీసీ !

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. బీజేపీ నుంచి బరిలోకి దిగే అభ్యర్థులను సైతం దృష్టిలో పెట్టుకొని వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా 'హైదరాబాద్-- రంగారెడ్డి-- మహబూబ్‌నగర్' స్థానంలో బీసీ అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా కాంగ్రెస్‌పై రాజకీయంగా ఒత్తిడి పెంచొచ్చని భావిస్తున్నట్టు సమాచారం.

రాకేశ్‌రెడ్డికి గ్రీన్‌సిగ్నల్.. !

'వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం'నుంచి గత ఉప ఎన్నికలో పోటీ చేసిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. 2024 మేలో జరిగిన ఉపఎన్నికలో లక్షకుపైగా ఓట్లు సాధించి, చివరి వరకు గట్టి పోటీ ఇవ్వడం ఆయనకు టికెట్ కేటాయింపులో అనుకూల అంశంగా మారింది. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఏర్పడిన పరిచయాలు, గత ఎన్నికల అనుభవం నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.ఇటీవల ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ ఈ మేరకు సంకేతాలిచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థానానికి కాంగ్రెస్ ఇప్పటికే రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో రాకేశ్‌రెడ్డిని మరోసారి బరిలోకి దించడం ద్వారా గత ఎన్నికల్లో సాధించిన ఓట్లను నిలబెట్టుకోవడంతోపాటు పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చవచ్చని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. అయితే 'హైదరాబాద్-- రంగారెడ్డి-- మహబూబ్‌నగర్'స్థానానికి అభ్యర్థిని ఖరారు చేసిన తర్వాతే రెండు స్థానాల అభ్యర్థుల పేర్లను కలిపి నేడోరేపో అధికా రికంగా ప్రకటించే అవకాశముంది.

బీసీ అభ్యర్థి కోసం అన్వేషణ

'హైదరాబాద్-- రంగారెడ్డి-- మహబూబ్‌నగర్' పట్టభద్రుల స్థానానికి బీసీ సామాజికవర్గానికి చెందిన బలమైన అభ్యర్థిని ఎంపిక చేసే అంశంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు కాసాని వీరేశ్ ముదిరాజ్, ఉద్యమకాలం నుంచి పార్టీలో కొనసాగుతున్న నాగేందర్‌గౌడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారుడితోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేరును కూడా నాయకత్వం పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. బీసీ సామాజికవర్గం కోణాన్ని పక్కన పెడితే స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు మరికొందరు పార్టీ నేతల పేర్లపైనా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే అభ్యర్థి ఎంపికపై ఒకటి రెండు రోజుల్లో కేసీఆర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

7 రోజుల తరువాత సీజేపీ
నాయకులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఉంది.వారిద్దరినీ రాజువీ ఎదుట హాజరుపరచగా, విచారణ సమయంలో వారి పూచీకత్తు పత్రాలను కూడా సమర్పించారు. అయితే వారి జైలు కస్టడీని మూడు రోజులు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. వీరి జ్యుడిషియల్ కస్టడీ విషయంలో జోక్యం చేసుకోవడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఎస్ఈఎం (రాజువీ) ముందు జరగనున్న విచారణ ఫలితం కోసం వేచి ఉండాలని, వారి ఫిర్యాదు కొనసాగితే అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని వారిని కోరింది.

దసరా మద్యం ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

నమోదయ్యాయి. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం.. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. మ్యాప్‌లు చూడండిగత ఏడాదితో పోలిస్తే ఇది 37.02 శాతం వృద్ధి. అయితే, ఈసారి ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) కంటే బీర్ల అమ్మకాలు అత్యధికంగా పెరిగాయి. ఈ కాలంలో బీర్ల విక్రయాలు దాదాపు 41 శాతానికి పైగా ఎగబాకాయి.గత ఏడాది ఇదే కాలంలో 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈసారి అది 30.37 లక్షల కేసులకు చేరుకుంది. ఇక ఐఎంఎఫ్ఎల్ విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులు ఉండగా, ఈ ఏడాది 18.38 లక్షల కేసులకు పెరిగాయి.

ఎక్సైజ్ శాఖ రోజువారీ నివేదికల ప్రకారం.. అక్టోబర్ 19న ఒక్కరోజే రాష్ట్రంలో రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల్లో భారీగా పెరుగుదల నమోదైంది. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు మందకొడిగా సాగినప్పటికీ, రెండో వారం నుంచి అమ్మకాలు ఒక్కసారిగా పుంజుకున్నట్లుగా ఎక్సైజ్ అధికారులు తెలిపారు.అక్టోబర్ 16 నాటికి రూ.1,527.85 కోట్లకు చేరిన క్యుమ్యులేటివ్ సెల్స్.. అక్టోబర్ 19 నాటికి రూ.2,054 కోట్లకు చేరాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ విపరీతంగా పెరగడం విశేషమని, ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన ఈ నివేదిక కేవలం అక్టోబర్ 19 వరకు మాత్రమే నమోదైన లెక్కల ఆధారంగానే రూపొందించామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.



'నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'..
రాహుల్ పర్యటనపై శశిథరూర్

తిరువనంతపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటన మరోసారి వార్తల్లో నిలిచింది. ఓ వైపు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, సర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తుండగా ఆయన విదేశాలకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో దిల్లీలో నిరసనలు జరుగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు విదేశాలకు వెళ్లారని తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌ను విలేకర్లు ప్రశ్నించారు. దీనిపై ఆయన వ్యంగ్యంగా స్పందించారు. "నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాను. ఆ ప్రశ్న నన్ను అడిగి ప్రయోజనం లేదు. నేను దిల్లీని వదిలి ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వచ్చాను? ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. కాబట్టి, దీనిపై నేను ఏమీ మాట్లాడదలుచుకోలేదు" అని బదులిచ్చారు. మరోవైపు దిల్లీ ఆందోళనల సమయంలో అబద్దాలు చెప్పి చెప్పి అలసిపోయి విదేశాలకు వెళుతున్నారంటూ భాజపా (దీఖ్రో) ఇప్పటికే విమర్శలు గుప్పిస్తోంది. వియత్నాం వెళ్తున్న విమానంలో రాహుల్ గాంధీ ఉన్నారంటూ భాజపా ఆ వీడియో ఎక్స్‌లో పోస్టు చేసింది.

ఎస్‌బీఐ ఖాతాదారుల డేటా డార్క్ వెబ్‌లోకి



దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన 3,897 మంది ఖాతాదారుల డేటా డార్క్ వెబ్‌లో లీక్ అయిందని, ఈ ఉల్లంఘనపై బ్యాంకు దర్యాప్తు ప్రారంభించిందని ఎస్‌బీఐ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ప్రకటించింది. పేరు, మొబైల్ నెంబర్, ఈ చిరునామా, ఆధార్ నంబర్, బ్యాంక్ సీఐఎఫ్ (కస్టమర్ ఇన్ఫర్మేషన్ ఫైల్ నంబర్)లు సైబర్ దాడికి పాల్పడ్డ హ్యాకర్లు డార్క్ వెబ్‌లో పెట్టారని అంగీకరించింది.దీంతో కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, వ్యాపార కొనసాగింపులపై ప్రభావం పడలేదని స్పష్టం చేసింది. థ్రెట్ ఇంటలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్ అయిన డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఇఆర్‌టీఐఎన్ ఇన్) నుంచి తమకు హెచ్చరిక అందిందని తెలిపింది. హెచ్చరిక అనంతరం ఎస్బీఐ ప్రాథమిక విచారణలో 3,75 లక్షల రికార్డుల విశ్లేషణలో 3,897 మంది వినియోగదారుల రికార్డులను డార్క్ వెబ్‌లో గుర్తించామని పేర్కొన్నారు.విషయం తెలియగానే భద్రతా నివారణ ప్రోటోకాల్‌ను అమలు చేశామని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. నష్టాన్ని అంచనా వేసేందుకు సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని, అనంతరం చర్యలు చేపడతామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

డ్రగ్స్ రహిత భారత్

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలని పిలుపునిచ్చారు. పోలీసు సంస్మరణ దినం సందర్భంగా బుధవారం ఢిల్లీలోని నేషనల్ పోలీస్ మెమోరియల్ (ఎన్పీఎం)లో జాతీయ పోలీస్ స్మారక చిహ్నం (ఎన్పీఎం) వద్ద పోలీ సు అమరవీరులకు అమిత్ షా నివాళులర్పించారు.9 రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 90 మంది పోలీసులతో 'మాదకద్రవ్యాలపై పోరాటం' థీమ్‌తో మోటార్ సైకిల్ ర్యాలీని కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. భారతదేశాన్ని మాదకద్రవ్య రహి తంగా మార్చడానికి ప్రధాని మోదీ 2029, డిసెంబర్ 31ని గడువుగా నిర్దేశించారని స్పష్టం చేశారు.2026లోని మిగిలిన నెలలతో పాటు 2027, 2028, 2029 సంవత్సరాలను కూడా మాదకద్రవ్యాలపై ఐక్య పోరాటం చేయాలని కేంద్రబలగాలను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని ఒక ప్రధాన జాతీయ ప్రాధాన్యతగా అభివర్ణించారు. మాదకద్రవ్యాలు భవిష్యత్ తరాలకు ముప్పు కలిగిస్తాయని, ఆర్థిక వ్యవస్థపై అనవసర భారాన్ని మోపుతాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తాయని ఆయన హెచ్చరించారు.దేశ భవిష్యత్ తరాలను రక్షించడా నికి డ్రగ్స్‌ను నిర్మూలించడం అత్యవసరమని స్పష్టం చేశారు. మాదకద్రవ్య రహిత భారత దేశమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా పోలీసు బలగాలు పనిచేయాలని అన్నారు. మార్చి 31, 2026 నాటికి దేశం దశాబ్దాల నక్సలిజాన్ని నిర్మూ లించిందని, తిరుగుబాటును ఎదుర్కోవడంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, మ్యాప్‌లు చూడండిసెంట్రల్ ఆరమ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), కోబ్రా పోషించిన పాత్రపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లో ఎన్నికల హింసను నిర్మూ లించడంలో దేశం విజయం సాధించిందన్నారు. అయితే పశ్చిమ బంగాల్‌లో మాత్రం ఎన్నికల హింస ఇంకా కొనసాగుతోందని తెలిపారు.కేంద్ర సాయుధ పోలీసు బలగాలు దేశంలో ఎన్నికల హింసకు ముగింపు పలికాయని ఆయన స్పష్టం చేశారు. కశ్మీర్, ఈశాన్య ప్రాంతాల తోపాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి నెలకొందని పేర్కొన్నారు. అమరవీ రుల కుటుంబాలను ఉద్దేశించి హోంమంత్రి మాట్లాడుతూ, ప్రియమైన వారిని కోల్పోవడం వల్ల కలిగే బాధకు ఎప్పటికీ తగిన పరిహారం లభించదని, వారి త్యాగాలను వెలకట్టలేమని స్పష్టం చేశారు. కానీ అమరవీరులు, వారి కుటుంబాలు చేసిన సేవ, త్యాగాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు.'డ్రగ్స్‌పై పోరాటం' బైక్ ర్యాలీ దేశ నలుమూలల నుంచి సాగి, ఈనెల గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరిగే ఏక్తా పరేడ్‌కు చేరకుంటుందని అధికారిక ప్రకటన తెలిపింది. గతేడాది 154 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 36,852 మంది పోలీసు సిబ్బంది అత్యున్నత త్యాగం చేశారని ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ మహేష్ దీక్షిత్ చెప్పారు.

తిప్పికొడతాం

(మొదటి పేజీ తరువాయి)

సాధించడమే లక్ష్యంగా, దేశ ప్రయోజనాలను సైతం పట్టించుకోని ధోరణిలో రాహు ల్‌గాంధీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ సంస్థలపై ప్రజల్లో అనుమానాలు కలిగించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీసేలా విపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇండి కూటమి చేస్తున్న ప్రచారానికి ప్రజల్లో వాస్తవాలను వివరించేందుకు బీజేపీ దేశవ్యాప్త కార్యాచరణకు సిద్ధమైందని తెలిపారు.ఇందులో భాగంగా అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విపక్షాల ఆరోపణలను ప్రజల్లోకి తీసుకెళ్లి తిప్పికొట్టడంతో పాటు, వాస్తవ పరిస్థితులను వివరించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు. ఇండి కూటమి ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వరంగల్ జిల్లా నర్సంపేట లో గోర్ మళవ్-2026 ఆహ్వాన పాంప్లెట్ ఆవిష్కరణ

గోర్ జాతి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం

నర్సంపేట 20 అక్టోబర్ 2026

(ప్రజా తీర్పు క్రైం న్యూస్ ప్రతినిధి):

నర్సంపేట : గోర్ జాతి తాతముత్తాతల నాటి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, గోర్ సమాజ ఐక్యత, ఆచార వ్యవహారాలు, చరిత్ర తదితర అంశాలపై చర్చించేందుకు నవంబర్ 24, 25 తేదీల్లో మెదక్ జిల్లా వాసురం తండాలో జరగనున్న గోర్ మళవ్--2026 కార్యక్రమానికి సంబంధించిన పాంప్లెట్‌ను వరంగల్‌కు చెందిన గోర్ శిక్వాడీ, గోర్ సేన సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గోర్ జాతి మూల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పెద్దలు అందించిన వారసత్వ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో భావితరాలకు మన సంస్కృతి గొప్పతనాన్ని పరిచయం చేయడంతో పాటు, సమాజంలోని యువతకు తమ జాతి చరిత్రపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గోర్ మళవ్--2026 వేదికగా గోర్ జాతి ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. గోర్ సమాజానికి



చెందిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాంప్లెట్ ఆవిష్కరణ కార్యక్రమంలో గోర్ సేన రాష్ట్ర ఆర్గనైజేషన్ సభ్యుడు దారావత్ కిషన్ నాయక్, రాష్ట్ర గోర్ గావణ్య బోడ కిషన్ నాయక్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు మీడియా వింగ్ ఇంచార్జ్ భూక్యా వెంకన్న రాథోడ్, రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమ వివరాలు:
- కార్యక్రమం: గోర్ మళవ్- 2026
- తేదీలు: నవంబర్ 24, 25, 2026 - వేదిక: వాసురం తండా, మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం



తోటకూర వజ్రేశ్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు

(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్, 20:

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ జన్మదినం సందర్భంగా పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్, పోచారం మాజీ మున్సిపల్ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల రాధాకృష్ణ ముదిరాజ్,మాజీ ఎంపీటీసీ సగ్గు అనిత, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, ఈ డబ్ల్యూ ఎస్ కాలనీ అధ్యక్షుడు కేశవపట్నం ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సగ్గు శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు మొల్గురం గణేష్, నాయకులు జెట్టోజీ నాగభూషణం చారి, గోరకంటి రవీందర్, తుంగతుర్తి రవి, తెలంగాణ విద్యార్థి ఉద్యమ జేఏసీ నాయకుడు డాక్టర్ మొక్క ఉపేందర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి, వజ్రేశ్ యాదవ్ కి శాలువాగప్పి హృదయపూర్వక 61వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలియజేశారు. ఈ సందర్భంగా వారు వజ్రేశ్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవల ముందున్న తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

- ఈ నెల 25న కోరుట్లలో శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవం

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 21

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్, ఆహ్వాన పత్రికను బుధవారం కరీంనగర్ నగరంలోని శ్రీ గిద్దె పెరుమాళ్ ఆలయంలో ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శర్మ సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గోసేవ చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మికత, సేవాభావం, ధార్మిక కార్యక్రమాల ప్రోత్సాహమే లక్ష్యంగా సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 25న కోరుట్లలోని జీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భక్తులు, శ్రీనివాస మిత్రులు, ఆధ్యాత్మిక అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, గోసేవ ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.



కేటీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి, అక్టోబర్ 21(ప్రజాతీర్పు)

దసరా పండుగ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ కి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో పాటు కూకట్ పల్లి నియోజకవర్గం బి ఆర్ యస్ పార్టీ కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు కె టి ఆర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వేం నరేందర్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన పీసీ సభ్యులు, టీపీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్పల్లి, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

విజయదశమి పర్వదిన సందర్భంగా పీసీ సభ్యులు, టీపీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కుటుంబ సమేతంగా రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర సందర్భంలో ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, ఐశ్వర్యం కలగాలని, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మాసాయిపేట ఆచారం, మంత్రాక్షతల ప్రసాదం

(వంజరపు) ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) అక్టోబర్ 20



భారత దేశం అనేక సంప్రదాయాల కలయిక. ప్రతీ గ్రామంలో ఆ గ్రామానికి విశేషమైన సంప్రదాయ, ఆచారాలు ఉంటాయి. ఈ సంప్రదాయాలు ఎప్పుడు, ఎలా మొదలైనా వాటిని తరతరాలుగా ఆచరిస్తూ వారి జీవితాలలో ఆ ఆచారాలను భాగం చేసుకుంటారు. అలా మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో కూడా ప్రతి విజయదశమికి ఇలాంటి ఒక ఆచారము అనాదిగా వస్తున్నది. అదే మంత్రాక్షతలు. గ్రామవాసులంతా కలసి ఊరు కూడలి నుంచి పాలపుట్టను చూడడానికి ఒకేసారి బయలుదేరి, పాలపిట్ట దర్శనము చేసుకొని అక్కడ దగ్గరలో ఉన్న పొలాల్లో ధాన్యాన్ని సేకరించి తిరిగి ఊర్లో గల పురాతన విఠలేశ్వరాలయానికి వస్తారు. అక్కడ జగదంబ విశేషంగా అర్చించిన ఎర్రటి మంత్రాక్షతలను తీసుకొని, పాండురంగ విఠలుని దర్శనము చేసుకొని ముందుకు బయలుదేరుతారు. తరువాత గ్రామ చావిడి నుండి హనుమాన్ దేవాలయం వద్ద వెళ్లి ఆయుధ, శమీ పూజలు నిర్వహించుకుని పండుగ జరుపుకుంటారు. ఈ ఆచారం కొన్ని తరాల నుంచి ఇలాగే సాగడం, ప్రతి యేట గ్రామస్తులు ఎక్కడ ఉన్నా, విజయదశమికి మాత్రం తప్పకుండా స్వంత గ్రామానికి చేరుకొని మంత్రాక్షతలను తీసుకోవడం ఇక్కడి అనుచనమైన ఆచారం. మళ్లీ తిరిగి గ్రామచావిడి వద్దకు చేరుకొని బాణాసంచాలు కాల్చి ఆలింగనం చేసుకొని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకుంటారు ఈ కార్యక్రమానికి గ్రామంలోని గ్రామస్తులు కుల సంఘ నాయకులు వివిధ పార్టీ నాయకులు చేరుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారు.

భూపాలపల్లిలో ఘనంగా పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్మృతి పరేడ్ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ మాట్లాడుతూ, దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఘనంగా బాబా 108 వ పుణ్యతిథి వేడుకలు

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 21.



జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రీ గుట్ట రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో గల శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం సాయిబాబా 108 వ పుణ్యతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన అర్చకులు గుంటి నిరంజన్ పర్యవేక్షణ లో ఉదయం నుండి బాబా ప్రతిమకు భక్తుల స్వహస్తల మీదుగా పాలాభిషేకం గావించారు, మహిళలు విశేష పూజలు, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం బాబా వారికి వేద పండితులచే విశేష హారతి చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు పల్లెర్ల శంకర్ రావు ఉటూరి భాస్కర్ నరేందుల అమర్ కొత్తపల్లి శ్రీనివాస్‌లక్ష్మి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక కృష్ణా నగర్ యందు గల శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం లో కూడా బాబా 108 వ పుణ్యతిథి వేడుకలు ఘనంగా చేశారు. డా. సతీష్ కుమార్, మార కైలాసం, నాగుల కిషన్ గౌడ్, రాం కిషన్ రావు, తిరుపతి గౌడ్, పూజారి గుండయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయుధ పూజలు

- దసరా సందర్భంగా ఆయుధ పూజ, శమీ పూజ, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు.

బుగ్గ కృష్ణమూర్తి శర్మ. ఎల్లారెడ్డి పేట .ప్రజా తీర్పు అక్టోబర్ 21



దసరా పండుగను పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం, స్టేషన్‌లో ఆయుధ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్, ఎస్ఐ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ, శమీ పూజతో పాటు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా పోలీస్ శాఖలో విధుల నిర్వహణకు ఉపయోగించే ఆయుధాలకు పూజలు చేశారు. అనంతరం శమీ వృక్షానికి పూజలు నిర్వహించి, దుర్గాదేవిని భక్తితో ఆరాధించారు. ప్రజలకు శాంతిభద్రతలు కల్పిస్తూ విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్‌కు చెందిన పలువురు పోలీసు సిబ్బంది పాల్గొని పూజలు చేశారు. దసరా పండుగను పురస్కరించుకొని పోలీస్ స్టేషన్‌లో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది.

కాసంలో కొనుగోలుదారులే ముఖ్యం.. పార్కింగ్ సమస్య గాలికేనా?

- జన సందడిపై శ్రద్ధ.. వాహనదారుల ఇబ్బందులపై నిర్లక్ష్యమా?

నర్సంపేట 19 అక్టోబర్ 2026(ప్రజా తీర్పు క్రైం న్యూస్ ప్రతినిధి వెంకన్న):

నర్సంపేట: వరంగల్ రోడ్డు వైపు ఉన్న కాసం ఫ్యాషన్స్ వద్ద పండగ సీజన్ కావడంతో కొనుగోలుదారుల సందడి రోజురోజుకూ పెరుగుతున్నా.. పార్కింగ్ సమస్య మాత్రం పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. దుకాణానికి వచ్చే వినియోగదారులపై చూపిస్తున్న శ్రద్ధ.. వారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాసం ఫ్యాషన్స్ వద్ద కొనుగోళ్ల కోసం జనం పెద్ద సంఖ్యలో వస్తుండటంతో దుకాణం ఎదుట ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంపులుగా నిలుస్తున్నాయి. దీంతో ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కన అస్తవ్యస్తంగా వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోళ్లపై ఉన్న శ్రద్ధ.. పార్కింగ్‌పై ఏదీ?

వ్యాపారం పెరగడం, కొనుగోలుదారులు అధిక సంఖ్యలో రావడం ఒకవైపు సంతోషకరమైన విషయమే. కానీ అదే సమయంలో వినియోగదారులు, ఇతర వాహనదారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన బాధ్యత వ్యాపార సంస్థపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు లేకపోతే ఆ ప్రభావం చివరకు రహదారిపై ప్రయాణించే సామాన్య ప్రజలపై పడుతోంది.

సీసీ కెమెరాలతో నిఘా.. రోడ్డు పార్కింగ్‌కు అడ్డుకట్ట!

రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపే వారిని గుర్తించేలా చర్యలు తీసుకుంటే పార్కింగ్ సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చని ప్రజలు సూచిస్తున్నారు. కెమెరాల ద్వారా పర్యవేక్షణతో పాటు ట్రాఫిక్ పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

వ్యాపార సంస్థలకూ బాధ్యత లేదా?

కొనుగోలుదారుల సౌకర్యంతో పాటు సాధారణ వాహనదారుల భద్రత కూడా ముఖ్యమే. దుకాణానికి వచ్చే వాహనాల కోసం తగిన పార్కింగ్ ఏర్పాట్లు చేయడం, రహదారిపై వాహనాలు నిలపకుండా వినియోగదారులకు సూచనలు ఇవ్వడం అవసరమని పలువురు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించేనా?

రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధమైన పార్కింగ్ చర్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడంతో పాటు ప్రమాదాల ముప్పును కూడా నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రజల ప్రశ్న ఒక్కటే.. కొనుగోలుదారుల రద్దీ కనిపిస్తున్నప్పుడు, రహదారిపై వాహనదారులు పడుతున్న ఇబ్బందులు యాజమాన్యంకు కనిపించడం లేదా? సీసీ కెమెరాల నిఘాతోనైనా రోడ్డు పార్కింగ్‌కు అడ్డుకట్ట పడేనా?

శాంతియుత సమాజమే పోలీసులు లక్ష్యం;

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్
- విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం; జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ...
- అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి.
- పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులు, కుటుంబ సభ్యులకు పరామర్శ.

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 21.



విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ డే ను జిల్లా లో ఘనంగా నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్, ఎస్పీ , పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు"శోక్ శ్రస్త్ర్" చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు,సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల త్యాగాలు, ధైర్యసాహసాలు, విధి పట్ల అంకితభావం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల రక్షణలో భాగంగా 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నేరాల నియంత్రణ, ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది కష్టపడి, ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేస్తూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని, వారి ఆశయాలకు అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా, వృత్తి నైపుణ్యంతో, మానవీయ దృక్పథంతో ప్రజలకు సేవలందించాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను కూడా స్మరించుకోవడం మన బాధ్యత అని తమ కుటుంబ సభ్యులను కోల్పోయినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగుతున్న అమరవీరుల కుటుంబాల త్యాగం, సహనం, మనోధైర్యం ఎంతో గొప్పవని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల త్యాగాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు, పోలీస్ స్టేషన్ల ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశాలు వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ధైర్యసాహసాలు, సేవాభావం, అంకితభావం జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు, సమాజ సేవకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ.... పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, పండుగలు, సెలవు రోజుల్లోనూ ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అమరవీరుల కుటుంబ సభ్యుల సంక్షేమం, పిల్లల విద్య, వారికి అందాల్సిన ప్రభుత్వ సహాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకత, జవాబుదారీతనం, మానవీయ దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అమరవీరుల ధైర్యసాహసాలు, త్యాగాలను మాటల్లోనే కాకుండా, వారి స్ఫూర్తితో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించడం ద్వారా గౌరవించాలని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనశీత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డిఎస్పీ లు పురుషోత్తం రెడ్డి,రాములు,రవికుమార్,సి.ఐ లు ఎస్.ఐ లు, పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 21.



శ్రీనివాస్ అనే పేరు గల వ్యక్తి గత తొమ్మిది నెలల క్రితం మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతుండగా ఇద్దరు గమనించి రాజేశుని శ్రీనివాస్ అధ్యక్షునిగా నిర్వహిస్తున్న శివ గాయత్రి అనాధ వృద్ధాశ్రమం రాజేశుని గుట్ట జగిత్యాలలో చేర్పించినారు. అప్పటినుండి కొంచెం తేరుకునట్లే కనిపించినాడు కానీ ఈరోజు ఉదయం లేచి కొంచెం ఆరోగ్యం బాగాలేదని, చలి పెడుతుందని టీ తాగి బెడ్ షీట్ కప్పుకొని నేను పండుకుంటానని చెప్పి పడుకున్నాడు. ఆశ్రమంలో మేనేజర్ గా పని చేస్తున్న మోటూరి నాగలింగం గారు ఆర్ఎంపీ డాక్టర్ను తీసుకుని వెళ్లి చూపించగా అతని చనిపోయినాడు అని తెలిపినారు. వెంటనే ఆశ్రమ నిర్వాహకులకు తెలుపగా వైకుంఠ రథం ఏర్పాటుచేసి చింతకుంట వద్ద స్మశానంలో హిందూ సాంప్రదాయం ప్రకారం రాజేశుని శ్రీనివాస్ గారు అంత్యక్రియలు నిర్వహించినారు. ఇట్టి కార్యక్రమంలో వృద్ధాశ్రమం ప్రధాన కార్యదర్శి రంగు రాజయ్య, కోశాధికారి కప్పల చంద్రమౌళి గారలు, ఆశ్రమ నిర్వాహకులు, మేనేజర్ మోటూరి నాగలింగం మరియు ఆశ్రమంలో ఉన్న వృద్ధులు కూడా పాల్గొన్నారు. అటు సమాజసేవనే కాకుండా ఎలాంటి పేగు బంధం లేకుండా శ్రీనివాస్ అనే పేరు బంధంతో అనాధ శవానికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన రాజేశుని శ్రీనివాస్ గారిని ఆశ్రమ నిర్వాహకులు మరియు ఆశ్రమంలో ఉన్న వృద్ధులు తన సేవలను కొనియాడినారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా అనాధ వృద్ధులు ఉన్నట్లయితే మా ఆశ్రమంలో చేర్చుకుంటామని తెలిపినారు. అలాగే జన్మదినం సందర్భంగా వివాహ వార్షికోత్సవం సందర్భంగా లేదా మన పెద్దల జయంతి వర్ధంతి రోజు ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో జరుపుకొని వారికి భోజన సదుపాయం కూడా కల్పించి మన పెద్దల సమక్షంలో జరుపుకున్నట్లుగా భావించవచ్చునని తెలిపినారు.

ఎల్లారెడ్డి పేట మండలంలో దసరా వేడుకలు

ఎల్లారెడ్డిపేట ప్రజా తీర్పు ఆక్టోబర్ 21



ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో విజయదశమి పండుగ వేడుకలు మంగళవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సంప్రదాయ బద్ధంగా శమీ పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేస్తూ దసరా పండుగను సరదాగా జరుపుకున్నారు. పాలపిట్టను దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని ఒకరికొకరు జమ్మి ఆకులను బంగారంగా పంచుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు,

ఘనంగా శమీపూజలు

జమ్మి బంగారం పంచుకుంటూ శుభాకాంక్షలు

విజయదశమి సందర్భంగా ప్రజలు జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్నేహితులు, బంధువులు, ఆత్మీయులు ఒకరికొకరు జమ్మి ఆకులను అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బందారపు బాల్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య , సింగల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్ రెడ్డి, మీసం రాజం , గుండాడి వెంకట్ రెడ్డి, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, సందుపట్ల లక్ష్మారెడ్డి, వివిధ కుల సంఘాల ప్రతినిదులు వార్డు సభ్యులు కొత్త ఆశలు, విజయాలు కలగాలని గ్రామం పురోహితులు రాచర్ల దయానంద శర్మ రాచర్ల హనుమాన్ల శర్మ, ఆలయ అర్చకులు బీట్కూరి గోపాలచార్యులు నవీన్ చార్యులు ప్రజా ప్రతినిధులకు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీల నాయకులకు గ్రామస్తులకు ఆశీర్వాదాలు అందజేశారు.

పటిష్ట పోలీసు బందోబస్తు.

దసరా వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ ఎస్సై రమేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో పోలీసులు ఆయా గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకునేలా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో మండలవ్యాప్తంగా దసరా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. రాచర్ల గొల్లపల్ల గ్రామంలోని వేణుగోపాలస్వామి, బాలా త్రిపుర సుందరి ఊ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులను గరుడ శావపై ఊరేగించి శోభాయాత్ర నిర్వహించారు. మీరు సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఉపసర్పంచ్ మణెమ్మ, గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు మృతి పోలీస్ శాఖకు తీరని లోటు..

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ జిల్లా ప్రతినిధి,21అక్టోబర్ ప్రజాతీర్పు):



నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న గడపలే బాబు (ఎజ 2228), విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో గత రాత్రి బైంసా పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు స్వగ్రామమైన నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబేరా గ్రామంలో నేడు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల హాజరై, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడి వారి బాధను పంచుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, పోలీస్ శాఖ కుటుంబానికి అండగా ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలు గుర్తుండిపోతాయని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ ఎస్. సాయికిరణ్, ముధోల్ సీఐ రవీందర్ నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ ఖాన్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దండేకర్ సాయికుమార్, పోలీస్ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొని గడపలే బాబుకు నివాళులర్పించారు.

దుర్గామాతకు పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు ..

- గ్రామస్థులతో ఆత్మీయ పలకరింపు..
- దేవి యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం..

పాపన్నపేట /మెదక్, అక్టోబర్ 21,(ప్రజా తీర్పు ప్రతినిధి):



పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నిమజ్జనం సందర్భంగా బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ వద్మాదేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి యూత్ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్థులు వద్మాదేవేందర్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపి ఆప్యాయంగా పలకరించారు. వారితో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కొడపాక గ్రామ సర్పంచి కాశీనాథ్‌రావు, పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచులు సంగప్ప, సంజీవరెడ్డి, బద్రి, మల్లేశం, శ్రీనాథ్‌రావు, నాయకులు బాలరాజు, శంకర్‌గుప్తా, దత్తు, చారి, దుర్గయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం సెట్, మల్లేశం, సాయివర్ధన్‌గౌడ్, దేవి యూత్ సభ్యులు నాగభూషణం, చారి, చన్‌బసప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆలయంలో సర్పంచ్ కు సన్మానం

ఎల్లారెడ్డిపేట ప్రజా తీర్పు ఆక్టోబర్ 21:

దసరా పండుగను పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని వాసవి మాత ఆలయాన్ని గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన ఆర్యవైశ్య సోదర సోదరీమణులను కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పండుగలు సమాజంలో ఐక్యతను, పరస్పర ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొంటూ, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌ను ఆర్యవైశ్య సోదర సోదరీమణులు ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సెస్ మాజీ డైరెక్టర్ చేపూరి రాజేశం, కేశెట్టి బాలరాజు, కూర శేఖర్, అల్లాడి ప్రేమ్ కుమార్, జొన్నల శ్రీనివాస్, బండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- పొలం నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- వేపాలగడ్డలో విషాదఛాయలు

సుజాతనగర్ అక్టోబర్ 21 (ప్రజా తీర్పు):





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం వేపా లగడ్డ గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. గ్రామంలో రోడ్డు దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని మణుగూరు వైపు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనతో వేములగడ్డ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో అక్కడికక్కడే మృతి

వేపలగడ్డ గ్రామానికి చెందిన చెన్నుబోయిన సత్యనారాయణ (50) తన పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో రోడ్డు దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.

భార్య, ఇద్దరు పిల్లలతో కుటుంబం..

సత్యనారాయణ మృతితో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సత్యనారాయణ మరణవార్త తెలిసిన గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

గ్రామంలో విషాదఛాయలు

వ్యవసాయ పనులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరుకుంటాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు ఆయన మరణవార్త తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనతో వేములగడ్డ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో ఒక నిండు ప్రాణం బలికావడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కూకట్‌పల్లిలో డామా గ్యాస్ట్రో క్లినిక్ ప్రారంభోత్సవం: ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్పల్లి, అక్టోబర్ 21 (ప్రజాతీర్పు)

కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1లో నూతనంగా ఏర్పాటు చేసిన డామా గ్యాస్ట్రో క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ, డామా గ్యాస్ట్రో క్లినిక్ ద్వారా సామాన్య ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు అనుకూలమైన ధరలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ నారాయణ రావు ఈ క్లినిక్ ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, బి ఎన్ రణదీప్, దాసరి వెంకట్ , ఆళ్ల నరేంద్ర వైద్య సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు ఘన సత్కారం

- 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం!

పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి అక్టోబర్ 21



టేకులపల్లి: మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పోరిక బలరాం నాయక్ బుధవారం టేకులపల్లి మండల కేంద్రంలోని టీజీటీట్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, జిఎల్ఏఎస్ జేఏసీ చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ ఆతిథ్యాన్ని స్వీకరించి విందు భోజనం చేశారు. అనంతరం లక్ష్మణ్ నాయక్ కుటుంబ సభ్యులు ఎంపీ పోరిక బలరాం నాయక్ ని శాలువాతో ఘనంగాసత్కరించారు.ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి,ఎంపీ పోరిక బలరాం నాయక్, లక్ష్మణ్ నాయక్ నివాసానికి వస్తున్న విషయం తెలుసుకున్న టేకులపల్లి మండలం వెంకట్య తండా వాసులు, మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, సుమారు 80 శాతం కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఎంపీ ని కోరారు.బాధితుల పరిస్థితిని తెలుసుకున్న ఎంపీ పోరిక బలరాం నాయక్ వెంటనే స్పందించి, సంబంధిత ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజా సమస్యలపై తక్షణ స్పందన.. బాధితులకు భరోసా,ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలిచి, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా తక్షణమే స్పందించిన ఎంపీ పోరిక బలరాం నాయక్ చొరవను స్థానికులు అభినందించారు. ప్రజా సమస్యల పట్ల బాధ్యతతో స్పందిస్తూ, కష్టాల్లో ఉన్న వారికి భరోసా కల్పించడంఅభినందనీయమని పేర్కొన్నారు.మానవత్వంతో స్పందించి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చొరవ తీసుకున్న ఎంపీ పోరిక బలరాం నాయక్ కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్.రెడ్యానాయక్. ,టేకులపల్లి మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా దేవా నాయక్,జగన్ నాయక్,ఇస్లావత్ సాయి,రవి,కుమార్,బాలు,చంప్లా,చంద్రు,ఆంగోత్ లక్పతి,శ్రీను,బిచ్చు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

- ఎర్రాయిగూడెం స్టేజ్ వద్ద రోడ్డు ప్రమాదం.. మరొకరికి తీవ్ర గాయాలు...

పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి అక్టోబర్ 21



టేకులపల్లి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఎర్రాయిగూడెం గ్రామానికి చెందిన వర్సా వీరస్వామి (40) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య సారక్క ఫిర్యాదు మేరకు బుధవారం బోడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.బోడు ఎస్ఐ రాజమౌళి తెలిపిన వివరాల ప్రకారం ఎర్రాయిగూడెం గ్రామానికి చెందిన వర్సా వీరస్వామి మంగళవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో టేకులపల్లి వైపు నుంచి తన స్వగ్రామమైన ఎర్రాయిగూడెంకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎర్రాయిగూడెం స్టేజ్ వద్దకు చేరుకోగానే బోడు గ్రామం వైపు నుంచి ఎదురుగా బైక్‌పై వస్తున్నమోదుగులగూడెం గ్రామానికి చెందిన రాజేష్ అతి వేగంగా వచ్చి వీరస్వామి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా,మార్గమధ్యంలోనే వీరస్వామి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సారక్క ఫిర్యాదు చేయడంతో బోడు ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మంత్రి శ్రీధర్ బాబుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్, 21:



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి శ్రీధర్ బాబు కి బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పొగుల దిలీప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ హరినాథ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆర్. ఉపేందర్, మైనారిటీ సెల్ నాయకుడు మహమ్మద్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. దసరా పండుగ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, విజయాలు తీసుకురావాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆకాంక్షించారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వారి సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం: కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం
- అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులు
- కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 21



ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఐఏఎస్, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పేర్కొన్నారు. అమరవీరుల సేవలు పోలీస్ శాఖకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించగా, అధికారులు గౌరవ వందనం సమర్పించారు.

శాంతిభద్రతలే అభివృద్ధికి పునాది: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల విద్యాభివృద్ధికి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అమరవీరుల ఆశయాల సాధనే నిజమైన నివాళి: సీపీ

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, దేశ సమగ్రత, అంతర్గత భద్రత, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని స్పష్టం చేశారు.

అమరవీరుల కుటుంబాలకు భరోసా

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారాలు, ఇతర ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

అక్టోబర్ 21 నుంచి 31 వరకు సంస్మరణ కార్యక్రమాలు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు, విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

నీరందక ఎండుతున్న వరి పంటలు

- చివరి దశలో సాగునీటి కొరతతో రైతులకు తీవ్ర నష్టం
- అప్పులు, పెట్టుబడుల భారం మధ్య అన్నదాతల ఆవేదన

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 21



కరీంనగర్ జిల్లాలో సాగునీటి కొరతతో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చివరి దశలో నీరు అందక వరి పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండ తీవ్రత పెరగడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో పొలాల్లో తేమ తగ్గి, చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయి. శంకరపట్నం మండలంలో ఈ సీజన్‌లో పలువురు రైతులు వరి సాగు చేపట్టారు. ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే పంట కోతలు ప్రారంభించి ధాన్యాన్ని విక్రయిస్తుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన రైతులు మాత్రం చివరి తడికి నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు, బావులపై ఆధారపడిన రైతులకు సరిపడా నీరు లభించకపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. పక్క రైతుల నుంచి నీటి సాయం పొందేందుకు ప్రయత్నించినా ఆశించిన ఫలితం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లింగాపూర్‌లో ఎండుతున్న వరి పొలాలు

శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో నీటి కొరత కారణంగా పలు వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఎండ తీవ్రతకు భూమి బీటలు వారుతోందని, సాగునీరు అందక పంటను కాపాడుకోవడం కష్టమవుతోందని రైతులు చెబుతున్నారు. చేసేదేమీ లేక కొందరు రైతులు తమ పొలాలను పశువుల మేతకు వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. లింగాపూర్‌కు చెందిన పోలవేని సదయ్య, గౌరవేణి శ్రీనివాస్‌తో పాటు నల్లగుట్ట ప్రాంతానికి చెందిన కేశిరెడ్డి మల్లారెడ్డి తదితర రైతులు నీటి కొరత కారణంగా పంట నష్టాన్ని ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

పెట్టుబడులు వృథా.. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు వృథా అవుతున్నాయని, ఆర్థికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పంట చేతికందకపోవడం తమ కుటుంబాలపై మరింత భారాన్ని మోపుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని గుర్తించి, సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నీటి కొరతతో పంట నష్టపోయిన రైతుల పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి అర్హులైన రైతులకు తగిన పరిహారం, ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



డ్రైవర్లకు దసరా కానుకగా యూనిఫామ్ పంపిణీచేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి అక్టోబర్ 21

టేకులపల్లి,:టేకులపల్లి టిప్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతులమీదుగా డ్రైవర్లకు కాకి చొక్కాలు 100 మందికి ఈరోజు అందజేశారు.ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్, టియుసిఐ అనుబంధ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న టిప్పర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోరం సురేందర్ చిట్టిబాబు టిప్పర్ అధ్యక్ష కార్యదర్శులు ఆదిత్య నరసింహారావు వెంకట్, టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపూల సుందర్ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి చేతుల మీదుగా డ్రైవర్లకు యూనిఫామ్ అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్లు కోయగూడెం ఓసి నుండి, బిపిఎల్, నవభారత్, కొత్తగూడెం ఆర్ ఎఫ్ సి ఎల్ ఇతర ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తున్న డ్రైవర్లుగా గుర్తింపు రావాలి అంటే కచ్చితంగా ప్రతిరోజు డ్యూటీలో కాకి చొక్కా దరించాల్సిందేనని అన్నారు. డ్రైవర్లు డ్యూటీలో అప్రమత్తంగా ఉంటూ తమ టిప్పర్లను నడపాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో నెహ్రూ మోహన్. కుంజా వీరభద్రం మదార్, చింటూ మోకాళ్ళ శేఖర్, చీమల మోహన్, నాగరాజు చోటు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోమ్ మంత్రి తుళ్ల దేవేందర్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ఘట్కేసర్ మండల నాయకులు

(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్, 21:



విజయదశమి పర్వదినం సందర్భంగా (దసరా పండుగ) సందర్భంగా బుధవారం మాజీ హోమ్ మంత్రి తుళ్ల దేవేందర్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఇందులో వేముల సంజీవ్ గౌడ్ ఘనపూర్, మాజీ సర్పంచ్ ఘట్కేసర్ మండల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కొండాపూర్ సీనియర్ నాయకులు పార్టీ సురేందర్ రెడ్డి, పోచారం ఎనిమిదో డివిజన్ సామల జయ మోహన్ రెడ్డి తదితరులు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం

- శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 21



సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంతో పాటు ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలకు కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ, అవసరమైన సందర్భాలలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. దేశ సరిహద్దుల పరిరక్షణలో సైన్యం, నావికాదళం, వైమానిక దళం కీలక పాత్ర పోషిస్తుండగా, దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను పోలీసులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతి భద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యతలని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో శాంతి సామరస్యాలు నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, పోలీసు శాఖ నిరంతర కృషి, అంకితభావం వల్ల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతున్నారని తెలిపారు. పోలీసు విధులు సవాళ్లతో కూడుకున్నవని, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రజలు తమ బాధ్యతను గుర్తించి చట్టాలను, నిబంధనలను పాటించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. సామాజిక బాధ్యత, పౌర స్పృహతో నిబంధనలు పాటించడం ద్వారా సమాజంలో సమస్యలను తగ్గించి, మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరించడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, తద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత సరిహద్దు గస్తీ విధులలో ఉన్న సిఆర్‌పిఎఫ్ బృందంపై శత్రు బలగాలు ఆకస్మిక దాడి చేయగా, మన జవాన్లు వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారని, ఆ చారిత్రక ఘటన స్ఫూర్తితోనే దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈ రోజున పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అమరవీరుల స్మారకంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత ఆశయం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అంకితభావంతో పని చేస్తారని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతీ పోలీస్, సైనిక జవాను త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ప్రజల ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. విధులలో ఉండే సిబ్బంది అంతా పూర్తి మనస్ఫూర్తిగా, అంకితభావంతో పని చేస్తూ పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్
- విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 21, (ప్రజా తీర్పు ప్రతినిధి):



శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం అక్టోబర్ 21 పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, తో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా... విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లా లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.... అకాల వర్షం వచ్చినప్పుడు... ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు తదితర సందర్భలల్లోప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ప్రతి రోజు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ముందుకు వెళ్లే పోలీస్ అధికారులు స్ఫూర్తిదయాకమన్నారు. పోలీస్ అమరుల త్యాగాలను వృధా కానివ్వకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం గా విధుల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లో శాంతిభద్రతలు నెలకొని ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ... అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారు అమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్ ప్యాక్ లు కలెక్టర్ ,ఎస్పీఅందించారు వ్యాచారచన పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,సిఐలు, ఎస్సైఓ, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మూడో ఆపరేటర్‌ను నియమించండి

మెదక్ విద్యుత్ డీఈ రామేశ్వరస్వామికి ఆపరేటర్ల వినతి

మెదక్, అక్టోబర్ 21, (ప్రజా తీర్పు ప్రతినిధి):

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మూడో ఆపరేటర్‌ను వెంటనే నియమించాలని కోరుతూ తోటి ఆపరేటర్లు మెదక్ విద్యుత్ డీఈ రామేశ్వరస్వామికి వినతిపత్రం సమర్పించారు. సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో పని ఒత్తిడి పెరిగి, విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ.. సుమారు పది రోజుల క్రితం టేక్మాల్ మండల పరిధిలోని దండువానీ కుంట తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందిన ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ ఘటన అనంతరం సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై రైతులు దాడి చేయడంతో ఆయన గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు ఆపరేటర్లతో విధుల నిర్వహణలో ఇబ్బందులు

సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఆపరేటర్ల పరిస్థితులు కూడా ఇబ్బందికరంగా ఉన్నాయని వారు డీఈ దృష్టికి తీసుకెళ్లారు. వారిలో ఒకరు గత ఏడాది కారు ప్రమాదంలో గాయపడి, కాలు విరగడంతో ప్రస్తుతం కోలుకుంటున్నారని తెలిపారు. మరో ఆపరేటర్ తండ్రి వారం రోజుల క్రితం మరణించడంతో వ్యక్తిగత విషాదంలో ఉన్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరు ఆపరేటర్లతోనే విధులను కొనసాగించడం కష్టంగా మారిందని, సిబ్బంది కొరత వల్ల పని భారం పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు తగిన సిబ్బంది అవసరమని పేర్కొన్నారు.

అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

ఎల్లుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఆపరేటర్లు కోరారు. మూడో ఆపరేటర్‌ను నియమించడం ద్వారా సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గడంతో పాటు విధుల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతను పరిష్కరించి, ఆపరేటర్లకు అవసరమైన సహకారం అందించాలని డీఈ రామేశ్వరస్వామికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆపరేటర్లు పి. శ్రీనివాస్, రమావత్ హరి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.



సొంతూరులో ఎమ్మెల్యే సరదాగా.....దసరా పండుగ వేళ

చొప్పదండి ఎమ్మెల్యే జనంతో మమేకం

బుగ్గ కృష్ణమూర్తిప్రజా తీర్పు:, ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 21...

తాను పుట్టి పెరిగిన ఊరిలో దసరా పండుగ వేళ ఎమ్మెల్యే సరదాగా ప్రజలతో మమేకమై అందరితో ఆనందాన్ని పరుచుకుంటూ జంబి బంగారాన్ని తీసుకుంటూ అలాయ్...బలాయ్ తీసుకుంటూ ప్రజలతో మమేకమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.... ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్ల పేటగ్రామానికి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామానికి వచ్చి ప్రజలతో పండుగ జరుపుకున్నాడు. చిన్ననాటి స్నేహితులు, తనతో కలిసి మెలిసి ఉండే సన్నిహితులు, క్లాస్ మెట్లు, గ్రామ ప్రజలను స్వయంగా కలుసుకుంటూ ఊరంతా కలియతిరిగి దసరా పండుగ రోజు ఎమ్మెల్యే సత్యం సంతూరులో... సరదాగా...సందడి చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.గత ఏడాది జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తన సోదరుడు దేవానందం సతీమణిని సర్పంచ్ గా గెలిపించి రాజకీయ సత్తా చాటాడు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొరుట్లపేట గ్రామం సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు కేటాయించగా, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సత్యం తన మరదలును గెలిపించుకొని ఆ స్థానాన్ని కాంగ్రెస్ ఖాతాలోకి చేర్చాడు. గ్రామాన్ని రాజకీయాలకతీతంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చి అదే బాటలో పయనిస్తూ స్థానికులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో మమేకమవుతున్నాడు. దసరా పర్వదినాన తన స్వగ్రామానికి చేరుకొని శమీ పూజ నిర్వహించి గ్రామస్తులతో దసరా వేడుకలు జరుపుకోవడం చర్చనీయాంశమైంది. గత వారం రోజుల క్రితం తన సోదరుడు మేడిపల్లి దేవానందమును ఎట్టకేలకు బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్గా నియమించ టం లో తన రాజకీయ చతురతను చాటుకున్నాడు. బొప్పాపూర్ చైర్మన్ పీఠం జనరల్ స్థానానికి ప్రభుత్వం కేటాయించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడుగా ఉండడంతో తన సోదరుడికి అప్పగించడంలో పై చేయిగా నిలిచాడు. అటు పంచాయతీ ఎన్నికల్లో నూ, బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామక విషయంలోనూ ఆయన అనుకున్నదే జరిగింది. దీంతో ఎమ్మెల్యే సత్యం సొంత మండలంలో సత్తా చాటుకుని రాజకీయంగా తన కుటుంబాన్ని మరింత బలోపేతం చేశాడని చర్చ తీవ్రంగా జరుగుతుంది. బొప్పాపూర్ మార్కెట్ కమిటీ ఏర్పడినప్పటి నుండిఈ పదవి కోసం ఆ గ్రామవాసులు ఎన్నో కలలు కన్నా ఆశలు ఆవిరి అయ్యాయి, ఎమ్మెల్యే సత్యం చొప్పదండి ప్రాతినిధ్యం వహిస్తున్నా.... స్థానికంగా తన పట్టు కోల్పోకుండా రాజకీయ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దసరా పండుగ వేళ ప్రజలతో సరదాగా జరుపుకుంటూ, గ్రామస్థులకు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని గ్రామస్థులకు భరోసా ఇవ్వడం ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. అతి చిన్న వయసులో మా ఊరి సత్యం అసెంబ్లీలో అడుగు పెట్టడం ఆనందంగా ఉందని ప్రజలు గర్వంగా చెప్పుకోవడం విశేషం.

'సర్' వ్యతిరేక నిరసనలో పరకాల ప్రభాకర్

సర్ పేరుతో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు నిరసనగా 'హర్ గలీ మే జంతర్ మంతర్' (ప్రతి వీధిలోనూ ఒక జంతర్ మంతర్) పేరుతో ఈ నెల 23న జరిపే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ పాల్గొననున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, నటుడు ప్రకాశ్ రాజ్, సీనియర్ అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్, రైతు నేత రాకేశ్ టికాయత్, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా, రచయిత తుషార్ గాంధీలతో ఆయన వేదికను పంచుకుంటారు.



పైడిమడుగులో వైభవంగా దసరా ఉత్సవాలు..

- ముఖ్య అతిథులుగా అడిషనల్ కమిషనర్ జక్కుల శంకరయ్య, తురగా స్వామిరెడ్డి, రిటైర్ పంచాయతీ శాఖ ఈ ఈ

కోరుట్ల ప్రజాతీర్పు అక్టోబర్ 21

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో విజయదశమి (దసరా) వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా జీహెచ్ఎంసీ హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ జక్కుల శంకరయ్య, ప్రముఖ సంస్థ అనేవా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ ఎడిటర్ తుర్గా స్వామిరెడ్డి రిటైర్ పంచాయతీ రాజ్ శాఖ ఈఈ తోకల భూమేశ్వర్ హాజరయ్యారు.వీరికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన జమ్మి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ జక్కుల శంకరయ్య మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ గ్రామాల్లో ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆకాంక్షించారు.అలాగే తుర్గా స్వామిరెడ్డి మాట్లాడుతూ.. పల్లెసీమల్లో సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఇంత ఉత్సాహంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.అనంతరం గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు "జమ్మి ఆకు" (బంగారం) ఇచ్చిపుచ్చుకుంటూ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, యువజన సంఘాల సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



కత్తితో హత్యాయత్నం.. ముగ్గురు నిందితులు అరెస్ట్

- దసరా పండుగ సందర్భంగా జరిగిన గొడవే దాడికి కారణం

కోరుట్ల, ప్రజాతీర్పు అక్టోబర్ 21:

దసరా పండుగ సందర్భంగా జరిగిన గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ (43) తన కాలనీలో దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌నగర్ కాలనీకి చెందిన కిరణ్ (19), అజయ్ (19)లతో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 21న తెల్లవారుజామున 3 గంటల సమయంలో కిరణ్, అజయ్‌లు తమతో పాటు జ్ఞానదీప్ (20)ను తీసుకొని అర్బన్ కాలనీలోని దుర్గామాత ఆలయం వద్దకు వచ్చి రాజేందర్‌తో గొడవకు దిగారు.ఈ క్రమంలో కిరణ్, అజయ్‌లు రాజేందర్‌ను పట్టుకోగా, జ్ఞానదీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. దీంతో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు గాయాలయ్యాయి. స్థానికులు నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, వారు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కోరుట్ల పోలీసులు ముగ్గురు నిందితులు కిరణ్, అజయ్, జ్ఞానదీప్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.పండుగల సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కోరుట్ల సీఐ కె. తిరుపతి, ఎస్ఐ జి. శ్యామ్ రాజ్ తెలిపారు.

గీతంలో సినీవారం 2026 ప్రారంభం

- సృజనాత్మకత, సినిమా నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్న విద్యార్థులు

పటాన్ చేరు ప్రజాతీర్పు ప్రతినిధి



ఎల్లప్పుడూ రొటీన్ చదువులతో విసిగిపోకుండా, కాస్తంత వైవిధ్యాన్ని చాటేలా సినీవారం 2026 కార్యక్రమానికి హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. మీసేవ సహకారంతో, గీతం విద్యార్థి విభాగం జి-స్టూడియో ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. విద్యార్థుల సృజనాత్మకతను, సినిమా నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన కార్యశాలలు, సినిమా ప్రదర్శనలు, ఫోటోగ్రఫీ ప్రదర్శనలు, ఆటలు, ముఖాముఖి వంటి ఆసక్తికరమైన కార్యక్రమాలతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవం సినీ పరిశ్రమ నిపుణులను, ఔత్సాహిక చిత్ర నిర్మాతలను ఒకచోట చేర్చి, సినిమాలోని వివిధ అంశాలపై విలువైన అంతర్దృష్టులను అందిస్తుంది. విద్యార్థుల ఎంట్రీలను మూల్యాంకనం చేయడానికి ఫ్యూజిఫిల్మ్ఎక్స్ ఇండియా సౌహార్ద్ర రాయబారి బాబ్జీ చౌదరి ఫోటోగ్రఫీ ప్రదర్శనను సందర్శించగా, డైరెక్టర్ నిఖిల్ నాదెళ్ల ఒక కార్యశాలను నిర్వహించారు. ఈ వేడుకలకు వినోదాన్ని, ఉత్సాహాన్ని జోడిస్తూ, స్టార్ స్విచ్, బ్రెయిన్ ఇన్ ఎ కప్, ఫిస్ట్ అండ్ ఫింగర్స్, కప్ ఇట్, పోలరాయిడ్ ఫోటో బూత్ వంటి ఉత్సాహభరితమైన గేమ్ స్టాల్స్ కూడా ఈ కార్యక్రమంలో ఉన్నాయి. రెండవ రోజు (గురువారం) స్టోరీబోర్డింగ్ పోటీ, డాక్యుమెంటరీ ఫోటోగ్రాఫర్ కిషోర్ కృష్ణమూర్తి నిర్వహించే 'మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని డాక్యుమెంట్ చేయడం' అనే కార్యక్రమం, సంగీత స్వరకర్త తమన్ తో ముఖాముఖి ఉంటాయి. వర్ధమాన చిత్ర నిర్మాతల కథ చెప్పే ప్రతిభను, సృజనాత్మక దృష్టిని చాటిచెప్పే షార్ట్ ఫిల్మ్ పోటీకి చిత్ర నిర్మాత కృష్ణ చైతన్య అతిథిగా హాజరవుతారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ, పరిశ్రమ నిపుణులతో సంభాషిస్తూ, తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. వారు ఈ విభిన్నమైన అభ్యాస అవకాశాలను ప్రశంసించడమే గాక, ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. సినీవారం 2026 ద్వారా, గీతం హైదరాబాదు విద్యార్థులకు సినిమాను అన్వేషించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి, వారి సృజనాత్మక, సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఒక ఉత్తేజకరమైన వేదికను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



వేదిరలో వైభవంగా శమీపూజ ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నెరెళ్ల శారద

(జక్కుల శ్రీకాంత్ కరీంనగర్, ప్రజా తీర్పు ప్రతినిధి)అక్టోబర్ 21 .

రామడుగు మండలం వేదిర గ్రామంలో శమీపూజ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నెరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శమీపూజ ప్రాంగణం వరకు రథయాత్ర నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శమీపూజ నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి, జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేదిర శమీపూజ ఉత్సవాలను గ్రామ పండుగగా భావించే గ్రామస్తులు దేశవిదేశాల నుంచి స్వగ్రామానికి చేరుకుని బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. ఈ ఉత్సవాలు గ్రామ ఐక్యతకు, సంప్రదాయ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహించే ఈ వేడుకలు తమ గ్రామంలో జరగడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శనిగరపు అంజన్ కుమార్, వినాయక రెడ్డి సంఘం అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, ఉద్యోగులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



18 నెలల్లో శ్రీవారి ఆలయ నిర్మాణం పూర్తి!

- పద్మనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో పనులు.. నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

(జక్కుల శ్రీకాంత్, కరీంనగర్ ,ప్రజాతీర్పు) అక్టోబర్21:

కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించి, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన పనులు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, తదుపరి చేపట్టాల్సిన నిర్మాణ కార్యక్రమాలు, ఆలయ నిర్మాణానికి పట్టే సమయం తదితర అంశాలపై కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతిని కాంట్రాక్టర్లు ఆయనకు వివరించారు.

ఏడాదిన్నరలో ఆలయం పూర్తి

పద్మనగర్‌లో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని మరో 18 నెలల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు గంగుల కమలాకర్‌కు తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేసేలా నిర్మాణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, బోనాల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఒళ్లాల మల్లేశం, దుర్షెడ్ మాజీ ఉపసర్పంచ్ శుంకిశాల సంపత్‌రావు, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



చిన్నారుల చదువుకు చేయూత.. సేవా కార్యక్రమంలో యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ 369!

- దేవి నవరాత్రుల సందర్భంగా బియ్యం, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ
- చిన్నారుల జీవితాల్లో ఆశలు నింపడమే లక్ష్యం: నిర్వాహకులు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21,ప్రజా తీర్పు

దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ 369 ఆధ్వర్యంలో చిన్నారులకు బియ్యం, పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్. రాజేష్, డైరెక్టర్ సునీత నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం సేవాభావానికి, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చిన్నారులకు, పలు పాఠశాలలకు, స్థానిక ప్రజలకు బియ్యం, పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందించడం సంతోషంగా ఉందన్నారు. అవసరంలో ఉన్నవారికి మన వంతుగా చేసే ప్రతి చిన్న సహాయం.. ఒక చిన్నారి భవిష్యత్తుకు పెద్ద ఆశగా మారుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ 369 సభ్యులను నిర్వాహకులు అభినందించారు. పండుగల వేళ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి తోడ్పాటు అందించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ యూజర్ల డాటా లీక్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)పై సైబర్ దాడి జరిగినట్టు యాజమాన్యం అంగీకరించింది. హ్యాకర్లు బ్యాంక్‌కు చెందిన వినియోగదారులు రికార్డులను యాక్సెస్ చేసినట్టు తెలిపింది. స్టాక్ ఎక్స్చేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో 3,897 మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలు డార్క్‌వెబ్‌లో బహిర్గతమై ఉండవచ్చునని వెల్లడించింది.

ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయ రగడ

- గత పదేళ్ల నిధుల వివరాలు వెల్లడించాలి: జాప రాజిరెడ్డి

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 21)



గ్రామసభ పేరుతో ఇందిరమ్మ ఇళ్ల అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగడం స్వాగతించదగిన విషయమే అయినా, అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గుండారెడ్డిపల్లి గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ గృహాలు, ఎన్ని ప్రత్యేక అభివృద్ధి నిధులు తీసుకొచ్చిందో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. గ్రామానికి వచ్చిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడకుండా, ఏ ప్రభుత్వం ఏ పథకం ద్వారా ఎంత ప్రయోజనం కల్పించిందో చర్చించాలని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, వైద్య సహాయం కోసం ఎల్ఓసీలు, రైతులకు రైతు భరోసా, మహిళలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, గ్రామంలో రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు జాప రాజిరెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గతంలో ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన కుటుంబాలకు ప్రస్తుతం కార్డులు అందడం, పేద కుటుంబాలకు గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం కలగడం ప్రజలకు ఊరటనిచ్చే విషయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో కూడా అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరగాలని స్పష్టం చేశారు.

గత పదేళ్లలో గ్రామానికి వచ్చిన నిధులెన్ని?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ గుండారెడ్డిపల్లి గ్రామానికి ఏయే ప్రత్యేక అభివృద్ధి నిధులు తీసుకొచ్చారు? 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ గ్రామపంచాయతీ నిధులకు అదనంగా మంజూరైన పనుల వివరాలేమిటి? ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని జాప రాజిరెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలపై రాజకీయాలు చేయడం కంటే గ్రామానికి వచ్చిన నిధులు, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజల ముందు ఉంచడం ముఖ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేసే వారు గతంలో తమ పాలనలో సాధించిన అభివృద్ధిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామసభలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాలి కానీ రాజకీయ ప్రచారానికి వేదిక కాకూడదని రాజిరెడ్డి అన్నారు. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారం జరిగితే ప్రజలు వాస్తవాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.



ఇందుర్తి గ్రామానికి 2.80 లక్షల విలువైన వైకుంఠ రథం బహుకరణ

శాలువాలు కప్పి ఘనంగా సత్కరించిన సర్పంచ్, గ్రామ ప్రజలు

హుస్నాబాద్ అక్టోబర్ 21, ప్రజా తీర్పు, రవీందర్

చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామ పంచాయతీకి ఆదర్శనీయమైన సేవ లభించింది. గ్రామానికి చెందిన దాతలు రాగి నాగరాజు – సరిత దంపతులు తమ తల్లిదండ్రులు కేతమ్మ – మల్లయ్య జ్ఞాపకార్థం గ్రామ ప్రజల సౌకర్యార్థం 2.80 లక్షల విలువగల ఒక ‘వైకుంఠ రథం’ (అంతిమ యాత్రా వాహనం)ను బహుకరించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా మరణిస్తే, వారి అంతిమ సంస్కారాల నిమిత్తం పార్థివ దేహాన్ని శ్మశాన వాటికకు గౌరవప్రదంగా తరలించేందుకు ఈ రథం ఎంతో ఉపయోగపడనుంది. అంతేకాకుండా, దాతల గొప్ప మనసును చాటుకుంటూ... గ్రామంలో ఏ కుటుంబంలోనైనా మరణం సంభవిస్తే, ఆ అంతిమ యాత్ర రవాణా ఖర్చుల నిమిత్తం డీజిల్ కోసం రూ. 500/– నగదును కూడా తామే స్వయంగా అందజేస్తామని నాగరాజు – సరిత దంపతులు ప్రకటించారు. వారి ఈ ఉదార స్వభావాన్ని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మరియు యువజన సంఘాలు హృదయపూర్వకంగా అభినందించారు.సమాజానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని, కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు ఇది కొండంత భరోసానిస్తుందని గ్రామ ప్రముఖులు కొనియాడారు. ఈ సందర్భంగా రాగి నాగరాజు – సరిత దంపతులను మరియు వారి కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాగి నాగరాజు మాట్లాడుతూ పుట్టిన ఊరు కన్నతల్లితో సమానం ఊరికి సేవచేయాలనే ఆలోచనతో ఈ వైకుంఠ రథాన్ని అందజేయడం జరిగిందని గతంలో కూడా మసీదు కు గ్రిల్స్ కొరకు 35 వెలారుపాయలు ఇవ్వడం జరిగిందని అలాగే ఒకటవ వార్డులో తన ఇంటి ఆవరణలోని ఒక గుంట స్థలాన్ని మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి ఇచ్చానని రానున్న రోజుల్లో గ్రామ అభివృద్ధికి తనకు తోచిన ఆర్థిక సహాయం అందజేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చింతపూల అనిల్,సింగిల్ విండో డైరెక్టర్లు చింతపూల సాయన్న, చిట్యాల బల్ రెడ్డి, కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, వార్డు సభ్యులు తోట లావణ్య,గట్టు లక్ష్మీ,అందే బాబు,మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు,మాజీ వార్డు సభ్యులు చెల్పూరి విష్ణుమాచారి,కూన మల్లయ్య,బండోజు రాజేందర్, తోట చంద్రయ్య,లింగమూర్తి,సదానందం, గట్టు కిరణ్,కంది మల్లారెడ్డి,తోట సంతోష్,పులి మణికంఠ,గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మున్సి'పోల్స్'కు బ్రేక్

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. ఈ ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా ప్రకటించారు. మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్టు ఎస్ఈసీ తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముందుకు వెళ్లనున్నట్టు చెప్పారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు వచ్చాక గురువారం ఉత్తర్వులు జారీచేయనున్నట్టు వెల్లడించారు.

దేశ ప్రధానికి బెదిరింపులపై చర్యలు తీసుకోవాలి!

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, ప్రజా తీర్పు



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బెదిరింపులకు దిగుతూ, దేశ సమగ్రతకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నుపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొంపల్లి భూక్య శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

విదేశాల నుంచి దేశ వ్యతిరేక కార్యకలాపాలు సహించరాదు

పన్ను భారతదేశంలో నిరసన కార్యక్రమాల కోసం తొమ్మిది కోట్ల రూపాయలు ఇచ్చినట్లు ప్రకటించారని, ప్రధాని నరేంద్ర మోదీని హతమార్చాలంటూ, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలంటూ వ్యాఖ్యలు చేసినట్లు శంకర్ నాయక్ ఆరోపించారు. దేశంలో అశాంతిని సృష్టించేలా, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాల్లో ఉంటూ భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని చట్టపరంగా ఎదుర్కోవాలని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులకు వినతిపత్రం

ఈ అంశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నట్లు శంకర్ నాయక్ తెలిపారు. పన్నును చట్టప్రకారం అరెస్టు చేసి, అవసరమైన న్యాయ ప్రక్రియను అనుసరిస్తూ భారత్‌కు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తానన్నారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

దేశ సమగ్రతను కాపాడాలి

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా ప్రధానిగా ఎన్నికైన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వేర్పాటువాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని శంకర్ నాయక్ ఆరోపించారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి, భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

రాజకీయ పరిణామాలపై విమర్శలు

ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న నేపథ్యంలో, ఆ కార్యక్రమం వెనుక ఉన్న ఉద్దేశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని శంకర్ నాయక్ కోరారు. ప్రతిపక్షాల రాజకీయ కార్యక్రమాలను వేర్పాటువాద శక్తులతో ముడిపెడుతూ ఆయన పలు విమర్శలు చేశారు. దేశంలో అశాంతికి తావులేకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ, జాతీయ సమగ్రతకు విఘాతం కలిగించే ప్రయత్నాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శంకర్ నాయక్ పేర్కొన్నారు. పన్ను వ్యాఖ్యలపై సంబంధిత దర్యాప్తు సంస్థలు విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వరంగల్‌లో పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

- విధి నిర్వహణలో 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులు..
- అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం: సీపీ ఎన్. శ్వేత

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో





పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ అమరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషిని వివరించారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 25 మంది పోలీస్ అమరులు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని కమిషనర్ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు.

అమరవీరుల స్మారకంగా కొవ్వొత్తుల ర్యాలీ

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని అశోక జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుంది. అక్కడ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సాహసం, అంకితభావాన్ని స్మరించుకోవడం ర్యాలీ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరుల స్ఫూర్తితో ప్రజా రక్షణకు అంకితభావంతో పనిచేయాలి:
- జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులకు జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్, ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఘన నివాళులర్పించారు

విధి నిర్వహణలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్‌తో కలిసి అమర పోలీసులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.



హాట్ స్ప్రింగ్స్ ఘటన అమరుల త్యాగానికి ప్రతీక

1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద దేశ రక్షణ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖ

తెలంగాణలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో అనేక మంది పోలీసులు ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారని ఎస్పీ గుర్తుచేశారు. విధి నిర్వహణలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులకు నివాళి

2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎస్పీ అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాలే లక్ష్యం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనగా ఈరోజు 21 నుంచి అక్టోబర్ 31న నిర్వహించే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం వరకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేసే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్--ప్రజల మధ్య పరస్పర నమ్మకాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి అని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

అత్యవసర సమయంలో ప్లేట్లెట్స్ దానం చేసిన జిల్లా సాయి గణేష్

- 21వ సారి రక్తం, ప్లేట్లెట్స్ దానం.. ప్రాణదాతగా నిలిచిన సాయి గణేష్

కోరుట్ల, ప్రజాతీర్పు అక్టోబర్ 21



కోరుట్ల పట్టణంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విద్యాసాగర్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం బి పాజిటివ్ ప్లేట్లెట్స్ అవసరమయ్యాయి. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు దాత కోసం వెతుకుతూ టీమ్ ఎస్ఎంఎఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అఖిల్ వెలగందుల, ఉదయ్ కుమార్‌లను సంప్రదించారు. వారు సామాజిక సేవకుడు, టీమ్ ఎస్ఎంఎఫ్ సభ్యుడు, శ్రీ మహాలక్ష్మి ట్రేడర్స్ యజమాని జిల్లా సాయి గణేష్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సాయి గణేష్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి ప్లేట్లెట్స్ దానం చేశారు. అత్యవసర సమయంలో స్పందించి ప్లేట్లెట్స్ అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తం, ప్లేట్లెట్స్ అవసరమైన వారికి అర్ధరాత్రి వేళలోనైనా, ఎంత దూరంలో అవసరం ఉన్నా సహాయం చేసేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని సాయి గణేష్ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయన 14 సార్లు రక్తదానం, 7 సార్లు ప్లేట్లెట్స్ దానం కలిపి మొత్తం 21 సార్లు దానం చేశారు. ఈ సందర్భంగా సాయి గణేష్‌ను బ్లడ్ బ్యాంకు సిబ్బంది, టీమ్ ఎస్ఎంఎఫ్ నిర్వాహకులు అఖిల్ వెలగందుల, ఉదయ్ కుమార్, సంస్థ సభ్యులు, జనసేన పార్టీ జిల్లా నాయకుడు ఎలగందుల అజయ్, బాధితుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. అత్యవసర సమయంలో రక్తదానం, ప్లేట్లెట్స్ దానం చేసేందుకు యువత ముందుకు రావాలని వారు కోరారు.



ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- అమరుల కుటుంబాలకు ఎల్ల వేళల అండగా ఉంటామని భరోసా
- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు జిల్లా అధికారులతో పాటు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను పోలీసులు నక్సలిజం పైన, టెర్రరిజం పైన చేసిన కృషి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిందని కొనియాడారు. ఇక్కడి పోలీస్ అనుసరిస్తున్న వ్యూహాలు, విధానాలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసులు పుణికి పుచ్చుకున్నారని గుర్తు చేశారు. మార్చి 31 వరకు నక్సల్ రహిత దేశంగా మార్చడంలో తెలంగాణ పోలీస్ చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అదే విధంగా ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అనుసరిస్తూ యువతను సరైన దిశలో నడిపించాలని నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహించినట్లు అదేవిధంగా ప్రస్తుతం ఫ్రీ కోచింగ్ అందిస్తున్నట్లు తెలియజేశారు. యువత తప్పు దారిన పడకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి అమరవీరుల కుటుంబాలకు తాము ఎల్లప్పుడూ తోడుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన తనను సంప్రదించవచ్చని భరోసానిచ్చారు. అనంతరం ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ భట్ ఐపిఎస్ దేశవ్యాప్తంగా అమరులైన వారి వివరాలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి ఏటూరునాగారం మనన్ భట్ ఐపిఎస్, అడిషనల్ ఎస్పీ సదానందం , డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్, ములుగు డి.ఎస్.పి రవీందర్, సిఐలు దయాకర్, సురేష్, సూర్య ప్రకాష్, రమేష్, ఆర్ఐలు స్వామి, వెంకటనారాయణ, శ్రీకాంత్, తిరుపతి, ఎస్ఐలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో ఘనంగా విజయదశమి సంబరాలు

- దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శమీ పూజ, హాజరైన బిక్కునాథ్ నాయక్ , తౌర్య నాయక్ లు

(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) సెప్టెంబర్20:

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో శమీ వృక్షం పూజ శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ పోచారం వార్డు-8, అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో మూడు దేవాలయల అమ్మవార్లకు ప్రత్యేక పూజలను పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నానావత్ బిక్కునాథ్ నాయక్, బిజెపి నాయకులు తౌర్య నాయక్ లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాడ శ్యామ్ మాట్లాడుతూ.. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. కాలనీలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుకున్నారు. కాలనీ ప్రజల సహకారంతో శాంతియుతంగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా విజయదశమి పర్వదినం పురస్కరించుకొని చేపూరి కృష్ణయ్య పంతులు, అమరావది కృపాకరాచారి శమీ వృక్షానికి ఆయుధ పూజ నిర్వహించడంతో, దేవాలయ కమిటీ ఆకుపచ్చ బంగారాన్ని ప్రజలకు పంచారు. ప్రజలందరూ కూడా పాల్గొని ఆకుపచ్చ బంగారాన్ని పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు దేవాలయ కమిటీ సభ్యులందరూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రాములు గౌడ్ తో పాటు, దేవాలయ కమిటీ సభ్యులు జింక యాదగిరి, పంబలి ఎల్లయ్య, మైస మైసయ్య, అమరావది కృపాకరాచారి, సురేష్ నాయుడు, కాలనీ సీనియర్ నాయకులు అన్వర్ పాష, కాలనీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకుడు మొక్క ఉపేందర్, ఈశ్వర్, జయచంద్ర, గుడి భజన బృందం, బి రాజు గౌడ్, ఎన్ రాజు, మైస మధు, అనసూయ, పంబలి ప్రవీణ్, సుల్తాన్ సురేష్, సంధ్య, దివ్య, మాధవి, గంధం శోభ, సంతోషి అశోక్, మైసమ్మ, ఎన్ వనిత, యాదమ్మ, వై.వనమాల బిక్షపతి, కాలనీ ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధుల? రావణ దహనం...6 గురిపై కేసు నమోదు

వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసిపి సదానందం

హుస్నాబాద్ అక్టోబర్ 21 రవీందర్ ప్రజా తీర్పు

గ్రామంలో వర్గ వైశ్యామ్యాలు రెచ్చగొట్టి ప్రజా ప్రతినిధుల ఫోటోలను ఫ్లెక్సీ ల పై ముద్రించి దహనం చేసిన ఘటన హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగినట్లు, దీంతో ఆరుగురు పై కేసు నమోదు చేసినట్లు హుస్నాబాద్ ఏసిపి సదానందం పేర్కొన్నారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం....హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలోని ధర్మసాగర్‌పల్లి గ్రామ సర్పంచ్ కరివేద చంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, అక్టోబర్ 20న రాత్రి దసరా పండుగ వేడుకల సందర్భంగా ధర్మసాగర్‌పల్లి గ్రామంలోని హనుమాన్ గుడి వద్ద ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా పోతర వేణి రాకేష్, లోనే హరీష్, మోతుకూరు శ్రీకాంత్, గొండ అజయ్ కుమార్, బండ అభిషేక్ అనే ఐదుగురు యువకులు గుమికూడారు. గ్రామంలో వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా, ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా,పల్లె వాతావరణంలో అశాంతిని సృష్టించే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీని రావణాసురుని రూపంలో తయారు చేయించారు. సదరు ఫ్లెక్సీని కోహెడలోని మణికంఠ ఫ్లెక్సీ ప్రింటర్ షాపు నిర్వాహకుడు ఆరిఫ్ సాయంతో తయారు చేయించి, దాన్ని కట్టెలకు కట్టి, గడ్డి పెట్టి నిప్పు అంటించి దహనం చేశారు. అంతేకాకుండా, ఈ దృశ్యాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసి, ప్రజల మధ్య పగలు పెంచే విధంగా, గొడవలు సృష్టించేలా ప్రచారం చేశారని పేర్కొన్నారు. కాగా ఫ్లెక్సీలను తయారు చేసి దహనానికి పాల్పడిన ఐదుగురితోపాటు ఫ్లెక్సీ ప్రింటర్ యజమాని పై కోహెడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని హుస్నాబాద్ ఏసిపి సదానందం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ,చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, రాజకీయ ఉద్రిక్తతలు లేదా వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా, అశాంతికి గురిచేసినా సహించేది లేదని,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభవం
- దశకంఠుని సంహరణతో ముగిసిన నవరాత్రి వేడుకలు

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్)



శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శనలు, భజనలతో ఆధ్యాత్మిక శోభ,రాస్ గర్భా, దాండియా, బతుకమ్మ వేడుకలతో వెల్లివిరిసిన భారతీయ సంస్కృతి. తొమ్మిది రోజులపాటు భక్తులను అలరించిన నవరాత్రి ఉత్సవాలు. అమెరికాలోని ఫోర్ట్ వర్త్ హిందూ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆయుధ , వాహన పూజలు, భక్తులకు తీర్థప్రసాదాల వితరణతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శాస్త్రీయ సంగీత, నృత్య ప్రదర్శనలు, భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమరోగింది. చివరిరోజు రావణ సంహార కార్యక్రమంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ లలితా సహస్రనామ పారాయణం, శ్రీదేవి ఖడ్గమాల, మహిషాసుర మర్దిని స్తోత్ర పారాయణాలను నిర్వహించారు. కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి పూజలతోపాటు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో ఆలయానికి విచ్చేసిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ప్రధాన అర్చకులు మురళీకృష్ణ మాచార్య, రావల్ ధృవాచార్యులు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆయుధ, వాహన పూజల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దైవానుగ్రహాన్ని కోరుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

సంగీత, నృత్య ప్రదర్శనలు, భజనలతో భక్తిభావం

నవరాత్రి వేడుకల్లో భాగంగా సంహిత బిక్కి తదితరులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య, వీణా వాద్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. భక్తి గీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కళాకారుల ప్రదర్శనలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. సంగీతం, నృత్యం, భక్తి కార్యక్రమాల సమ్మేళనం ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన రాస్ గర్భా, దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల పూలతో అలంకరించిన పెద్ద బతుకమ్మ వేడుకలు, ఉయ్యాల పాటలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పాయి. రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలతో ఆలయం శోభాయమానంగా వెలిగిపోయింది. చివరిరోజు రావణ సంహార కార్యక్రమం ఉత్సవాలకు ముగింపు వేడుకగా నిలిచింది.

కమిటీ సభ్యుల సమన్వయంతో విజయవంతం

ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ వెంకటేశ్వరరావు నశీబూరు లక్ష్మీ సంబూరు మురళీ వెన్నం డాక్టర్ వినయం వెన్నం రజనీజానీ రన్నాజానీ అరవింద్ నీలా నానా డాక్టర్ కలేరియా తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉదయ్ దేశాయ్‌తోపాటు వివిధ కమిటీల బాధ్యులు సురేంద్రబాబు బిక్కి పూర్ణిమ బెల్ పటేల్ కీర్తి పటేల్ మౌలేష్ త్రిపాఠి, సచ్చిదానంద దేవదాసు సుందర శంకరన్ ఉమా రామ్ ప్రసాద్ రూణా ఘోష్ రాధాకృష్ణన్ సాయి కుమార్ రెడ్డి, జన్ను భాయ్ పటేల్ ప్రవీణ్ కుమార్ మోహన్ నాథ్ తదితరులు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు.

భక్తుల భాగస్వామ్యం, నిర్వాహకుల సమన్వయం,

సంప్రదాయబద్ధమైన పూజలు, సంగీత, నృత్య ప్రదర్శనలు, భజనలతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. విదేశీ గడ్డపై భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా ఈ వేడుకలు నిలిచాయి.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020